# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 05-05-2016**

మనిషికి ప్రాథమిక అవసరమైన బట్ట గుడ్డలను తయారు చేసే పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకోవడం శోచనీయమని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యవసాయం తర్వాత అతి పెద్దదైన వస్త్ర పరిశ్రమ దాని అనుబంధ రంగాలకు తెలంగాణ ప్రభుత్వం ఆసరాగా నిలబడుతుందని సిఎం భరోసా ఇచ్చారు. బుధవారం తెలంగాణ స్పిన్నింగు మిల్లుల యజమానుల సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం నేతలు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. స్పిన్నింగు మిల్లులు ఎదుర్కుంటున్న సమస్యలను సిఎంకు వివరించారు.

ప్రపంచ మార్కెట్ లో చోటు చేసుకుంటున్న ఆర్థిక మాంద్యం తదితర కారణల వల్ల స్పిన్నింగు మిల్లులు సంక్షోభంలో చిక్కుకున్నాయని, తెలంగాణ స్పిన్నింగు మిల్లులను సంక్షోభం నుంచి గట్టెక్కించాలని ముఖ్యమంత్రి కేసిఆర్ ను మిల్లు యజమానులు కోరారు. పత్తి ఎగుమతుల మీద పన్ను భారం పెరగడం ఆందోళన కలిగించే అంశమని ఈ సందర్భంగా సిఎం అన్నారు. అంతర్జాతీయంగా రోజు రోజుకూ వస్త్ర ఎగుమతులు తగ్గే ప్రమాదమున్న నేపధ్యంలో దేశీయంగా కాటన్ ఉత్పత్తులను ప్రజలు ఆదరించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరమున్నదని సిఎం అన్నారు. 120 కోట్ల జనాభా ఉన్న భారత దేశంలోని వస్త్ర పరిశ్రమను బలోపేతం చేయాల్సిన అవసరమున్నదని అన్నారు.

చైనా తన కరెన్సీ రేటును తగ్గిచ్చుకోవడం వలన భారత దేశ బట్టల ఎగుమతుల మీద తీవ్ర ప్రభావం పడిందని, తద్వారా స్పిన్నింగు మిల్లులు సంక్షోభంలో చిక్కుకున్నాయని, తమను ఆదుకోవాలని యజమానులు చేసిన విజ్ఞప్తిని ఆలకించిన ముఖ్యమంత్రి వారినుంచి పూర్తి వివరాలు తీసుకున్నారు. అందుకు సంబంధించి పూర్తి

సమాచారాన్ని సేకరించి అధ్యయనం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. సిఎం సానుకూలంగా స్పందించడం పట్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.కె. అగర్వాల్, మద్ది అనంతరెడ్డి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులతో పాటు ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, పరిశ్రమల శాఖ కార్యదర్శి అరవింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సిపిఆర్ఓ టు సిఎం**